'ప్రాజెక్టు టైగర్' :

# ప్రజలనుండి పులుల సంరక్షణ

నల్లమల అడవి మన రాష్ట్రంలోని దట్టమైన అడవులలో ఒకటి. కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాలలో దాదాపు 17000 చ.కి.మీ.ల పర్యంతం విస్తరించి ఉంది. ఈ అడవికి నడిబొడ్డున శ్రీశైలం ఉంది. అడవి మధ్యగా కృష్ణానది ప్రవహిస్తుంది. చెంచులు ఈ అడవిలో నివసించే ప్రధానమైన గిరిజన తెగ. వీళ్ళలో ఎక్కువశాతం ఈనాటికీ వ్యవసాయదారులు కారు. అడవి సంపదను (కట్టెపుల్లలు, గోందు (బంక), కుంకుడుకాయలు, విప్పపువ్వు, తునికాకు, గడ్డలు, కానుగాకు, పండ్లు, సారపప్పు మొదలగునవి) సేకరించి తినగలిగినవి తిని మిగిలినవి అమ్ముకొని బ్రతుకుతారు. చదువుకున్నవాళ్ళు తక్కువ. ఉద్యోగస్తులు ఇంకా తక్కువ. ఐటిడిఏ ఆధ్వర్యంలో మన్ననూర్‌లో ప్రధానంగా చెంచుల నుద్దేశించి కట్టిన ఐటిఐ లోని 100 చిల్లర విద్యార్థులలో చెంచులు ఒక్కరూ లేరు- అంతా ఎరుకలూ, లంబాడీలే!

చెంచుల తరువాత ప్రధాన తెగ లంబాడీలు, ఆ తర్వాత ఎరుకలు. వీరు కాక ఈ అడవిప్రాంతంలో అనేక గిరిజనేతర కులాలవాళ్ళు నివసిస్తున్నారు. అడవి సంపన్నమైనది కావడంవల్ల నేల సారవంతమైనది కావడంవల్ల, జనాభా బాగానే వుంది. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే నల్లమల అడవి ప్రాంతంలో నాలుగు మండలాలకు చెందిన 23 గ్రామాలున్నాయి. వాటి మొత్తం జనాభా దాదాపు 48000.

ఈ అడవి భారతదేశంలో పులులున్న కొన్ని అడవులలో ఒకటి కావడం ఈ జనం చేసుకున్న 'కర్మ'. పులులతో ప్రజలు ప్రకృతిలో సహజీవనం చేస్తున్నంతకాలం పెద్దగా సమస్య రాలేదు. పులుల జనాభా అడవులలో ఉండేది. అవి దట్టమైన అడవులలో ఇతర వన్యప్రాణులను భుజిస్తూ బ్రతికేవి. ఎప్పుడయినా అడవులలో మేతకు పోయిన పశువులమీద దాడిచేసి తినేవి. అయితే జనం కూడా రకరకాల యుక్తులతో వాటిని చంపేవారు. ఉదాహరణకు ఒక మేకకో గొర్రెకో విషంపెట్టి పులులు సంచరించేచోట వదిలేవారు. పులులు వాటిని తిని చచ్చేవి. ఈ విధంగా పులులకూ, ప్రజలకూ మధ్య ఒకరకమైన సహజ సమతుల్యం ఏర్పడింది.

ఈ సమతుల్యాన్ని చెడగొట్టింది ప్రభుత్వం. దేశంలో పులుల జనాభా క్రమంగా క్షీణించిపోతూ వుందనీ వాటిని పెంపొందించడం అవసరమనీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. దేశంలో పులులుండే అడవులలో "ప్రాజెక్టు టైగర్" పేరిట పులుల సంవర్ధక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికి 18 ప్రాజెక్టు టైగర్లు వెలిశాయి. నాగార్జునసాగర్-శ్రీశైలం ప్రాజెక్టు టైగర్ పేరిట మన రాష్ట్రంలో నల్లమల అడవులలో ఒకటి 1983లో వెలిసింది. ఈ ప్రాజెక్టుక్రింద నల్లమల అడవులలో 3568 చ.కి.మీ.ల అటవీ భూభాగం వుంది. విశాలమైన ఈ అటవీ భూభాగం పులులకు అభయారణ్యం. దీనిని రెండుగా విభజిస్తారు. మధ్యలోవున్న 1200 చ.కి.మీ.ల దట్టమైన అడవిని కేంద్ర ప్రాంతం (core area) అంటారు. ఇది పులుల నివాసం. అవి దాహం తీర్చుకునేందుకని ప్రభుత్వం ఇక్కడ చెరువులు తవ్వించింది. వాటికి సహజంగా దొరికే ఆహారంలో లవణం తక్కువగా ఉందని ఆ చెరువుల దగ్గర అవి నాకిపోవడానికి ఉప్పుగడ్డలు పెట్టింది. అవి తినడం కోసం జింకలను పెంచుతుంది. జింకలు బాగా అభివృద్ధి కావడం కోసం పచ్చికబయళ్ళను ప్రభుత్వం తయారుచేసింది. ఈ కేంద్ర ప్రాంతంలో ఎవ్వరూ పశువులను మేపడానికి వీలులేదు. పొరబాటున ఎవరి పశువులయినా ఈ కేంద్ర ప్రాంతంలోనికి ప్రవేశించి వాటిని పులులు తినేస్తే, వాటికి నష్టపరిహారం ఇవ్వరు. ఆ పశువుల యజమానులు పోయి అటవీశాఖ అధికార్లను అడిగితే 'మారాజా ఇంటికి నీ ఆవు ఎందుకుపోయింది?' అనో 'మా దొర జోలికి ఎవడు పొమ్మన్నాడు?' అనో ఎదురు జవాబు చెప్తారు. ఈ కేంద్ర ప్రాంతంలో ఎప్పటినుండో వుంటున్న 24 చెంచు గూడెంలు (ఇక్కడ వీటిని 'పెంటలు' అంటారు)తప్ప వేరే జన ఆవాసాలు గానీ, జనసంచారం గానీ ఉండడానికి వీలులేదు. కర్నూలుజిల్లాకు చెందిన కొన్ని 'పెంటలను' కేంద్రప్రాంతంనుండి తరలించి ఆ చెంచులకు నివాసయోగ్యం కాని మరొక ప్రదేశంలో పునరావాసం కల్పించారు. ప్రస్తుతం కేంద్రప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 14 పెంటలు, ప్రకాశంజిల్లాకు చెందిన 8 పెంటలు, గుంటూరుజిల్లాకు చెందిన 2పెంటలు ఉన్నాయి. ఇవన్నీకూడ బాగా చిన్నఆవాసాలు. 100కుపైగా కుటుంబాలున్నది ఒక్కటే- ప్రకాశం జిల్లాకు చెందిన పాలుట్ల (128కుటుంబాలు). అన్నిటికంటే చిన్నవి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన లింగచేరిపెంట (1 కుటుంబం మాత్రమే), అరిమానుచెలక (2 కుటుంబాలు), పుల్లాయిపల్లిపెంట (3 కుటుంబాలు). మొత్తం ఈ 24 పెంటల జనాభా కలిపితే 1725 మంది, అంటే సగటున ఒక్కొక్క పెంటలో 72 మంది. వీళ్ళ పశుసంపద 1429 జీవాలు. మేకలూ, గొర్రెలూ కూడ కలిపితే 1928 జీవాలు, వీళ్ళ వ్యవసాయం 1451 ఎకరాలు. ఈపాటి వ్యవసాయం వాళ్ళకు ఉండడానికి గల కారణం ఏమిటంటే మహబూబ్‌నగర్ జిల్లాలోని పెంటలు కేవలం చెంచుపెంటలు కాగా, ప్రకాశం, గుంటూరు జిల్లాలలోని పెంటలలో లంబాడీలు కూడ ఉన్నారు.

ఈ గణాంకాలు ఇవ్వడంలో ఒక ఉద్దేశ్యం ఉంది. ఈ 24 పెంటల జనం ఎప్పటినుండో పులుల మధ్య జీవిస్తున్నారు. వాళ్ళ అవసరాలకూ పులుల అవసరాలకూ మధ్య ఒక సమతుల్యం క్రమంగా ఏర్పడింది. ఆ సమతుల్యాన్ని ప్రజలకోసం ప్రభుత్వం భగ్నంచేస్తే పోనీలే అనుకోవచ్చును. ఈ ప్రజలంతా పెద్యూల్లు తెగలవారు కాబట్టి వారి బాగుకోసం ప్రభుత్వం అడవులను కొంత నాశనం చేసినా వన్యప్రాణులను ఇరకాటంలో పెట్టినా ఎవ్వరూ పెద్దగా అభ్యంతరం పెట్టేవారుకారు. కానీ ప్రభుత్వం ఆ ప్రయత్నం ఏ రోజూ చేయకపోగా ఇప్పుడు పులుల బాగుకోసం వాళ్ళు నివసించే అడవిని అభయారణ్యంగా ప్రకటించింది. ఈ ఏడు సంవత్సరాలలో ఆ అడవిలో పులుల జనాభా 40 నుండి 80కి పెరిగింది- అంటే రెండు రెట్లయింది. దీనితో పులుల ఆహార అవసరం సహజంగానే పెరుగుతుంది. ప్రజలకూ, వాళ్ళ పశువులకూ

ఇది ప్రాణసంకటంగా తయారయింది.

ఈ కేంద్రప్రాంతం (Core area) కంటే దాని చుట్టూ వున్న 2368 చ.కి.మీ.ల మధ్య ప్రాంతం (Buffer zone) పరిస్థితి ఒకరకంగా మరీ దయనీయమయినది. ఇక్కడ జనాభా ఎక్కువ, పశుసంపద ఎక్కువ. ఇక్కడి జనం జీవనాధారం వన్య సంపద సేకరణ కాదు, అభివృద్ధి చెందిన వ్యవసాయం. పైన చెప్పినట్టు ఒక మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఈ మధ్యప్రాంతంలో 23 గ్రామాలున్నాయి. వాటి జనాభా దాదాపు 48000. వ్యవసాయ భూమి, పశుసంపద అందుకు తగ్గట్టుగా వున్నాయి. ఇక్కడి జనాభాలో గిరిజనులే కాక గిరిజనేతర రైతులూ ఉన్నారు. ఒకరిద్దరు పెద్ద భూస్వాములూ వున్నారు. ఈ మధ్యప్రాంతంలో వ్యవసాయం, పశుపోషణ నిషిద్ధం కాదు. ఇక్కడి జనాన్ని వేరేచోటికి తరలించే ఉద్దేశ్యమూ ప్రభుత్వానికి లేదు. అయితే ఇదికూడ పులుల అభయారణ్యంలో భాగమే. తేడా ఏమిటంటే కేంద్ర ప్రాంతంలాగ ఇక్కడ జనసంచారాన్ని నిషేధించలేదు. పశుసంచారాన్ని నిషేధించలేదు. అడవి సంపద సేకరణను నిషేధించలేదు. ఇక్కడ సంచరించే పశువులను పులులు తినేస్తే వాటి మార్కెట్ విలువలో 10వ వంతు ప్రభుత్వం కట్టిస్తుంది. మనుషులను పులులు చంపితే 5,000 రూ॥ల దాకా ఎక్స్‌గ్రేషియా ఇస్తుంది. కానీ పులుల భయానికి అడవిసంపద సేకరించడానికీ పశుపోషణకూ అడవులలోకి పోలేక ఆదాయం కోల్పోతే దానినొక నష్టంగా ప్రభుత్వం గుర్తించదు. నష్టపరిహారం ఇవ్వదు.

అభయారణ్యంవల్ల పులుల సంరక్షణ పెరిగి, జనాభా పెరిగి, అవి కేంద్రప్రాంతంలోనే కాక మధ్యప్రాంతంలోనూ విచ్చలవిడిగా సంచరించడం ప్రారంభించాయి. పశువులను చంపడం తినడం ఎక్కువ చేశాయి. పశువులమీద దాడులు పెరుగుతున్నాయనడానికి ప్రభుత్వ గణాంకాలే నిదర్శనం. గత మూడేళ్ళగా ఒక్కొక్క సంవత్సరం పులుల వాత పడ్డ పశువుల సంఖ్య ఈ విధంగా వుంది :

| | | |
|---|---|---|
| 1987 | — | 271 |
| 1988 | — | 342 |
| 1989 | — | 408 |

క్రమంగా పశువుల నష్టం పెరుగుతూ వుందని సూచించడం కోసమే ఈ గణాంకాలు ఇస్తున్నాం. కానీ నిజానికి అటవీశాఖ దృష్టికి రాని కేసులు ఎన్నో ఉంటాయి. పశువు పులివాతపడి చనిపోయిన 72 గంటలలోపల అటవీశాఖకు తెలిస్తేనే వాళ్ళు లెక్కలోకి తీసుకుంటారు. పైగా రైతు ఇచ్చిన వర్తమానం అందుకొని పశువును చూడడానికి పోయిన అటవీ సిబ్బంది, దానిని చంపింది పులేనని ధృవీకరించాలి. ఈ సిబ్బంది రైతు ఇచ్చిన వర్తమానానికి నిజాయితీతో స్పందించరు. 50 రూ॥లు లంచం ఇస్తేతప్ప కదలరు. ఆలస్యం అయిపోతుందన్న ఆతృతతో రైతు లంచం ఇచ్చుకున్నా, ప్రభుత్వం చివరికి ఇచ్చే నష్టపరిహారం రెండు లేక మూడు వేలు ఖరీదుచేసే పశువుకు రెండు లేక మూడు వందలే కాబట్టి ఎందుకొచ్చిన శ్రమలే అని చాలామంది రైతులు ఊరుకుంటారు. ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క గ్రామంలోనే 100 దాకా పశువులను పులులు చంపుతున్నాయని జనం అంచనా.

ఈ పులులు నరమాంసభక్షకులు (man eaters) కావనీ కాబట్టి మనుషులకు వీటివల్ల ప్రమాదం లేదనీ అటవీశాఖ ప్రచారం చేస్తూ వుంది. ఈ పులులు నరమాంస భక్షకులు కావని మాట వాస్తవమే. అయితే అవి పశువుల మందలమీద దాడిచేసినప్పుడు ఆ పశువులకు కాపరిగావున్న వ్యక్తిని ముందు చంపుతాయి. ఆ వ్యక్తి తమ ఆహారానికి అడ్డం రాగలడన్న తెలివి, అనుభవం వాటికి వుంది. ఈ కారణంగా అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగే కొద్దీ తిండికోసం పోటీ పెరిగి పశువులమీద పులుల దాడీ, దానితో బాటు పశువుల కాపర్లమీద పులుల దాడీ పెరుగుతున్నాయి.

సంవత్సరం వారీగా పులులవాత పడిన మనుషుల సంఖ్య ఈ క్రింది పట్టికలో ఇస్తున్నాం. పైన ఇచ్చిన పశువుల గణాంకాల లాగ ఇదికూడ ఒక్క రేంజికి (మన్ననూర్ రేంజి) సంబంధించినది. మొత్తం ఈ ప్రాజెక్టు టైగర్‌లో మూడు రేంజిలు ఉన్నాయి. రెండింటి కేంద్రం మన్ననూర్‌లోనూ, ఒకదాని కేంద్రం నాగార్జున సాగర్‌లోనూ ఉన్నాయి. మన్ననూరు కేంద్రంగా గల ఒక రేంజి కేంద్రప్రాంత (core area) రేంజి. మిగిలిన రెండు రేంజిలు మనుషులు ఎక్కువగా నివసించే మధ్యప్రాంత రేంజిలు. ఆ రెండింటిలో ఒకటయిన మన్ననూరు రేంజిలో పులుల దాడులకు గురయిన వారి సంఖ్య ఈ క్రింది పట్టికలో ఇసున్నాం.

| సంవత్సరం | పులుల దాడిలో గాయపడినవారు | పులుల దాడిలో చనిపోయినవారు |
|---|---|---|
| 1980-81 | 1 | - |
| 81-82 | - | - |
| 82-83 | 2 | - |
| 83-84 | 5 | 2 |
| 84-85 | 5 | 1 |
| 85-86 | 7 | - |
| 86-87 | 4 | 1 |
| 87-88 | 6 | 1 |
| 88-89 | 10 | 4 |
| 89-90 | తెలియదు | 3 |

ఇవి ప్రభుత్వ గణాంకాలేనని మరొక్కసారి నొక్కి చెప్పాలి. పులుల సంరక్షణ ప్రజలకు క్రమంగా ఒక సమస్యగా ఎట్లా మారుతూ వుందో ఈ గణాంకాలు స్పష్టంగా చూపుతాయి.

పౌరహక్కుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా శాఖ రెండురోజుల కార్యక్రమం వేసుకొని మన్ననూర్ రేంజిలోని అప్పాయపల్లి, చెన్నంపల్లి, మన్ననూరు, మన్ననూర్ తాండ, వెంకటేశ్వర్ల బావి, మాచారం, మొల్కమామిడి, అమ్రాబాద్, తిరుమలాపురం, వటవర్లపల్లి గ్రామాలు పర్యటించి జనంతోనూ, అధికార్లతోనూ మాట్లాడినప్పుడు ఈ క్రింది వాస్తవాలు స్పష్టంగా కనిపించాయి. ఒకప్పుడు తమకూ, పులులకూ మధ్య వుండిన సమతుల్యం దెబ్బతినడాన్ని ప్రజలు విచిత్రంగా అర్థంచేసుకుంటున్నారు. 'మా పులులు మమ్మల్ని ఏమీ అనేవికావు. ప్రభుత్వం ప్రాజెక్టు టైగర్ పేరిట కొత్తగా పులులను తెచ్చి మా అడవిలో వదిలింది. అవే మామీద దాడి చేస్తున్నాయి' అంటున్నారు. ఇక ప్రభుత్వం పులులను తీసుకొచ్చిన లారీని స్వయంగా చూసినవారు,

లారీ డ్రైవర్‌తో మాట్లాడినవారూ అన్నిగ్రామాలలోనూ ఉన్నారు. సంరక్షణవల్ల పులుల జనాభా పెరిగిందనీ దాని ఫలితంగా ఆహారానికి కొరత ఏర్పడి పులులు జనంమీదా, జన ఆవాసాలమీదా దాడి చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందనీ అర్థం చేసుకోలేకపోవడంవల్ల ఈ రకమయిన కథలు వ్యాపిస్తున్నాయి.

ఇది మినహా మిగిలిన విషయాలలో మట్టుకు ప్రజలకుండే అవగాహన చాలా వాస్తవికమయినదే. జనం ఇవ్వాళ భయభ్రాంతులయి బ్రతుకుతున్నారు. అడవిసంపద ఏరడానికి అడవిలోకి పోవడానికి భయపడుతున్నారు. పూర్తిగా వెల్తురున్న సమయంలో మట్టుకే పోతున్నారు. దానివల్ల ఎంత ఆదాయం కోల్పోతున్నదీ లెక్కగట్టేవారెవ్వరు?

పశువులనయితే పులులకు నైవేద్యం పెట్టినట్టు సమర్పించుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో సంవత్సరానికి 100 దాకా పశువులు పోతున్నాయి. మేకలు, గొర్రెలు 200 దాకా పులులపాల పడుతున్నాయి. మేకలకూ, గొర్రెలకూ నష్టపరిహారం ఇవ్వరు కాబట్టి లెక్కపెట్టేవాళ్ళు లేరు. ఆవులకూ, ఎడ్లకూ, గేదెలకూ 10 శాతం ఎక్స్‌గ్రేషియా (రెండు వేలు ఖరీదుచేసే పశువుకు రు. 200/-) ఇస్తారు. అందులో 50 రూ॥లు మొదటే ఇన్స్‌పెక్టు చేయడానికి లంచం ఇవ్వాలి. అంతా అయితే ఎక్స్‌గ్రేషియా చేతికి అందడానికి 'బాగా పైరవీ చేస్తే' 3 నెలలూ పైరవీ చేయకపోతే 9 నెలలూ పడుతుంది. పైరవీ చేయాలంటే ప్రాజెక్టు టైగర్‌కు కేంద్రం అయిన సున్నిపెంట గ్రామానికి పోయి రావాలి. వచ్చే ఎక్స్‌గ్రేషియా లంచాలుపోను చార్జీలకే సరిపోతుంది. అందుకే ఇప్పుడు రైతులు చాలామంది ఫిర్యాదు చేయడమే మానుకున్నారు.

అయితే ఈ మధ్యకాలంలో పులులు చాలాచోట్ల గ్రామాలలోకే వచ్చేస్తున్నాయి. మాచారం గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి ఇంటి పెరట్లోకి దూకి మూడు పశువులను చంపింది ఒక పులి. చీకటి అయితే పులులు అడవి అంచున పచార్లుచేయడం మొదలుపెడతాయని అడవికి సమీపంలోని గ్రామాల జనం భయపడుతూ ఉంటారు. మన్ననూరు మాదిగవాడకు చెందిన ఈశ్వరయ్య ఒకరోజు ఊరిపక్కనవున్న చెరువుదగ్గర బర్రెలను కడుగుతూ వుంటే పులి అతనిమీద దాడి చేసింది. గొంతుమీద, ఛాతీమీద గాయం చేసింది. (అతనికి కోలుకోవడానికి రెండు నెలలు పట్టింది) పట్టపగలే ఈ ఘోరం జరిగేసరికి జనానికి బాగా కోపం వచ్చి గుమిగూడారు. పులి భయపడి చెరువు తూములో దాక్కుంది. ఒకప్పుడయితే జనం దానిని చంపేవారు. కాని ఇప్పుడు ఈ అభయారణ్యంలో పులిని చంపడం నేరం. ఆ నేరానికి 6 నెలలనుండి 6 ఏళ్ళదాకా జైలుశిక్ష, 500 నుండి 2000 రూ॥ల దాకా జుర్మానా. అయినా జనం కోపంతో పులిమీదికి రాళ్లు వేయసాగారు. అటవీశాఖ అధికారులూ, పోలీసులూ వచ్చారు. అప్పటికప్పుడు పోలీసులు నిషేధాజ్ఞలు ప్రకటించి లాఠీచార్జి చేశారు. అయినా జనం కదలలేదు. పులిని తమకు అప్పగించి చంపడానికి అనుమతి ఇవ్వాలి, లేదా అటవీశాఖవాళ్ళు పట్టుకుపోయి జూలో పెట్టాలి అనేది జనం డిమాండు. అయితే ఈ అడవిలో పులుల జనాభా పెరగడమే ప్రాజెక్టు టైగర్ లక్ష్యం కాబట్టి ఆ పులికి ఎటువంటి హాని జరగకుండ అడవిలోకి తోలుతామని అటవీశాఖ సిబ్బంది పట్టుబట్టారు. చాలాసేపు గొడవ జరిగింది. చివరికి జనం మొండితనానికి తట్టుకోలేక అటవీశాఖవారు పులికి మత్తుమందు తూటా కొట్టి తీసుకుపోయారు.

ప్రభుత్వ అధికార్లకు ప్రజలమీదకంటే పులులమీద ఇంత ప్రేమ ఉండడం జనానికి చాలా ఆగ్రహం కలిగించే విషయం. ప్రజలను బూతులతోతప్ప మర్యాదగా ఎన్నడూ సంబోధించని అటవీశాఖ అధికారులు పులులను మట్టుకు 'అయ్యగారు', 'దొర', 'రాజు' అని పిలవడం జనానికి బాధాకరంగా అనిపిస్తుంది. పులుల దాడిలో ప్రజలకు గాయం అయినా పశువులు దెబ్బతిన్నా ఫిర్యాదు ఇవ్వడానికి పోతే 'మీరే ఏదో చేసి ఉంటారు' అన్నట్టు మాట్లాడతారు అధికారులు. 'మా దొర జోలికి మీరెందుకు పోయారు?' అనీ, 'మారాజును మీరెందుకు రెచ్చగొట్టారు?'అనీ అడుగుతారు. పులుల సంరక్షణకోసం సంవత్సరానికి 30 లక్షల బడ్జెట్ పెట్టుకున్న ప్రాజెక్టు టైగర్ అందులో 1 లక్ష రూపాయలను మట్టుకే పులులవల్ల గాయపడిన లేక మరణించిన మనుషులకూ, పశువులకూ నష్టపరిహారంగా కేటాయిస్తుంది. మనుషులు చనిపోతే కేవలం 5000 రూ॥లు ఇస్తారు. గాయపడితే ఆస్పత్రిలో ఉన్నంత కాలం బయటినుండి కొనుక్కువచ్చే మందుల ఖర్చు మట్టుకు ప్రభుత్వం ఇస్తుంది. ఆస్పత్రినుండి డిస్చార్జ్ అయిన తరువాత అయ్యే ఖర్చుకుగానీ, కోల్పోయిన సంపాదనావకాశాలకుగానీ నష్టపరిహారం ఏమీ ఉండదు. వన్యప్రాణులను గురించి ప్రభుత్వానికి పట్టింపు వున్నందుకు ఎవరూ ఆక్షేపించరు. కానీ ప్రజల జీవనాన్ని ప్రాణాన్ని అందుకు పణం పెట్టడం సహించరాని విషయం.

# బీడీ కార్మికుల హక్కులు

మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరులోని బీడీ కార్మికులు కనీస హక్కులుకూడ లేని పరిస్థితిలో పనిచేస్తున్నారని తెలిసి, ఆ విషయాన్ని పరిశీలించడానికి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC) ఒక నిజనిర్ధారణ కమిటీని నియమించింది. కొన్ని గ్రామాలు పర్యటించి కొన్నివందలమంది బీడీ కార్మికులతో మాట్లాడింది. రెండు బీడీ కంపెనీల యజమాన్లతోనూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమశాఖ నియమించిన డాక్టర్‌తోనూ కూడ మాట్లాడింది. ఒక సంవత్సరం పైగా ఈ ప్రాంతంలో బీడీ కార్మికుల సమస్యలుచేపట్టి ఆందోళన జరుపుతున్న ఆంధ్రప్రదేశ్ బీడీ వర్కర్స్ యూనియన్ బాధ్యులతోను కమిటీ మాట్లాడింది. వీళ్ళందరితోను మాట్లాడిన పిదప కమిటీ రూపొందించిన నివేదికను ఇక్కడ ఇస్తున్నాము.

చాలా కాలంపాటు చట్టంలో బీడీకార్మికులకు ఏ హక్కులూ ఉండేవి కావు. బీడీ పని ఎక్కువగా ఎవరి ఇంట్లో వారు చేస్తారు. కాబట్టి ఆ పరిశ్రమకు 'ఫ్యాక్టరీ' నిర్వచనం వర్తించదు. ఈ పరిస్థితిని సవరించాలని దేశవ్యాపితంగా జరిగిన ఆందోళన ఫలితంగా 1966 లో బీడీ మరియు చుట్ట కార్మికుల (పని పరిస్థితుల) చట్టం జారీచేయడం జరిగింది. ఈ చట్టం ప్రకారం పారిశ్రామిక కార్మికులకు ఉండే హక్కులు చాలా వరకు బీడీ కార్మికులకు కూడ వర్తిస్తాయి. ఈ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందేగానీ